క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గూడూరు: మండలంలోని తీగలవేణి, పాటిమీదితండా, పడమటితండా, పానుగోడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆర్డీఓ అలివేలు సందర్శించాడు. అవసరమైన మార్పుల గూర్చి తెలుసుకున్నాడు. మౌలిక వసతులను పరిశీలించాడు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

గార్ల: రాష్ట్రంలో రెండో విడత మంత్రివర్గ విస్తరణలో లంబాడీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు చోటు కల్పించాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు అజ్మీర వెంకన్న సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం గార్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక శాతం ఉన్న 60 నియోజకవర్గాల్లో లంబాడీలు ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఎమ్మెల్యేలను గెలిపించారని పేర్కొన్నారు. గెలుపొందిన గిరిజన ఎమ్మెల్యేలు ఐక్యంగా ఉంటూ ఆదివాసీ, గిరిజన ప్రజల సమస్యలపై దృష్టి సారించి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

రూ.లక్ష ఆర్థికసాయం

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన నోముల నాగేశ్వర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు శనివారం ఇనుగుర్తి హైస్కూల్‌కి చెందిన 1984–85 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.1,05,000 అందజేశారు. కార్యక్రమంలో గుంశావాళి, పురుషోత్తం రెడ్డి, భోజ్యా, వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, సునిత, వసుంధర, పురుషోత్తం, శ్రీమాల పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

కేసముద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్ సౌకర్యం మంచిదేకాని, దీంతో రోడ్డున పడిన ఆటోడ్రైవర్‌ల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని కేసముద్రంస్టేషన్ బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు మిట్టగడుపుల మహేందర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి ఆటోడ్రైవర్‌కు నెలకు రూ.15వేలు అందించడంతోపాటు, రూ.10లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు



గార్ల: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గార్ల మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఎ జలీల్, ఏఎంసీ మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, ఎస్‌కే యాకూబ్‌పాషా, అశోక్, లెనిన్ ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌ల పంపిణీ



మరిపెడ రూరల్: మండలంలోని రాంపురం హైస్కూల్ విద్యార్థులకు శనివారం టై, బెల్ట్‌లను పంపిణీ చేశారు. ఇదే గ్రామానికి చెందిన దాత కొమ్ము లోకేష్‌కు ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఈసందర్భంగా కృతజ్ఞత భావంతో విద్యార్థులకు టై, బెల్ట్‌లు అందజేశాడు. కార్యక్రమంలో కొమ్ము చంద్రశేఖర్, స్కూల్ చైర్మన్ ఎల్డి అశోక్, పాఠశాల హెచ్‌ఎం శశిధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి పూజలు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు 10వ వార్డు వీరారం తండాలో శివదీక్ష స్వీకరించిన స్వాముల ఇరుముడిధారణ పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పూజల్లో పాల్గొన్నాడు. కార్యక్రమంలో భూక్యా రవీందర్ నాయక్ స్వామి, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, కౌన్సిలర్ భూక్యా శ్రీనునాయక్, బానోత్ రాము నాయక్ పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీ’లను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు అన్నారు. ఐక్య పార్టీల జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పన, పేదలకు రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశ లౌకిక వ్యవస్థ, ప్రజల ప్రజాస్వామిక హక్కులకు ప్రమాదకరంగా మారుతున్న మతోన్మాదాన్ని, ఫాసిజాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు అడ్డుకోవాలన్నారు. దేశంలో మోదీ నాయకత్వంలో ప్రభుత్వ రంగ సంస్థలను, దేశ సంపదను కార్పొరేట్, పెట్టుబడిదారి శక్తులకు అప్పనంగా కట్టబెడుతున్నారని విమర్శించాడు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని పదేండ్ల బీజేపీ పాలనలో మహిళలపై దాడులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. పూనెం ప్రభాకర్, చిర్ర సూరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చిన్న చంద్రన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రమా, నాయకులు కొత్తపల్లి రవి, ముల్కురి జగ్గన్న, ముంజంపల్లి వీరన్న, సూర్యం, సత్యం, వెంకటేశ్వర్లు, పాణి, అడ్డూరి రాజు, నర్సింహారావు, యాకయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’ గ్రామ సభలు



సభలో పాల్గొన్న గ్రామస్తులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తాళ్లఊకల్, తానంచర్ల, చిల్లంచర్ల గ్రామాల్లో ఈ ఏడాది చేసిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీల్లో భాగంగా శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా తానంచర్లలో గ్రామ కార్యదర్శి సెలువుపై వెళ్లిన సమయంలో మస్టర్లను మేట్‌లకు అప్పగించారు. ఇదే అదునుగా సదురు వ్యక్తులు ఇష్టం వచ్చినట్లుగా పని వివరాలను నమోదు చేశారు. పనికి రాని వారిని కూడా మస్టర్‌లో హాజరు వేశారు. దీంతో పని చేయని వారికి అకౌంట్‌లో డబ్బులు జమ అయినట్లు సభలో డీఆర్పీలు వెల్లడించారు. అదేవిధంగా తాళ్లఊకల్ గ్రామంలో పని చేసిన వారికి డబ్బులు జమకాలేదని వెల్లడించారు. ఆయా గ్రామాలకు కేటాయించిన బడ్జెట్‌లో సగం నిధులకు కూడా కూలీలకు పనులు కల్పించలేదని సభలో వివరించారు. అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించకపోవడం, పనులు కల్పించక పోవడంతోనే లక్షలాది రూపాయలు మిగిలాయని పలువురు సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయాలను ఈనెల 20వ తేదీన మరిపెడలో నిర్వహించే మండల సభలో వెల్లడించాలని ఆయా గ్రామస్తులు కోరారు. ఆయా కార్యక్రమంలో సర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘కేటీఆర్ ఆరోపణలు అర్థరహితం’

మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్యే కేటీఆర్‌వి కల్లబొల్లి మాటలే అని కాంగ్రెస్ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గవర్నర్ ఉపన్యాసానికి ధన్యవాదాలు చెప్పే క్రమంలో అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని అవి అర్థరహితమన్నారు. పదేళ్ల తమ పాలనలో జరిగిన ప్రజాహక్కుల విధ్వంసాన్ని, చేసిన మోసాలకు, మేసిన వేల కోట్ల రూపాయలకు సమాధానం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ ఆధ్వర్యంలో మానుకోట అభివృద్ధి జరిగి, బంగారుకోట అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు.

చట్ట విరుద్ధంగా దత్తత ఇవ్వొద్దు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, ఎస్సై, కమిటీ సభ్యులు

కురవి: మాతృత్వం ఒక వరమని, దత్తత మరో మార్గమని చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట దత్తత అనే అంశంపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత ఇచ్చిన, తీసుకున్న వారికి మూడేళ్ల శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించాడు. ఏ ప్రయోజనం కోసమైనా బాలబాలికలను అమ్ముకోవడం నేరమవుతుందన్నారు. చట్టాలు సులభతరంగా మారాయని, క్రమ పద్ధతిలో దత్తత మార్గాన్ని సులభతరం చేసుకోవచ్చని తెలిపారు. సంబంధిత అధికారులను సంప్రదించి ప్రజలు సురక్షితంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎస్సై గోపి, ఆర్‌ఐలు రవికుమార్, లక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్ పూర్ణచందర్, హెచ్‌ఎం వాహిద్, సర్పంచ్ బిక్షం, దేవరశెట్టి మల్సూర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

గార్ల: ఉద్యోగం రాలేదని మనస్థాపానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వినయ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పీడీఎస్‌యూ మండల కార్యదర్శి మహేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శనివారం ఆయన మాట్లాడారు. మృతుడు వినయ్ సూసైడ్ నోట్‌లో పేపర్ లీకేజీలతో విసిగిపోయానని, పేపర్ లీకేజీలు అవడంతో మనస్థాపంతో సూసైడ్ చేసుకుంటున్నానని పేర్కొన్నట్లు ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లోనైనా ఉద్యోగాల జాబ్ క్యాలండర్ విడుదల చేసి ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల ఆశయాలను నెరవేర్చాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



సచిన్ (ఫైల్)

గూడూరు: మండలంలోని వెంగంపేటకు చెందిన మడిపెల్లి సచిన్ (28) అనే యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వరంగల్ ఎంజీఎంలో మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మడిపెల్లి రాజు, ఇందిరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడైన మడిపెల్లి సచిన్ పీజీ వరకు చదివాడు. వారం రోజుల క్రితం ఇంట్లో తల్లి, డబ్బులు ఖర్చు పెట్టిన విషయంలో మందలించడంతో మనస్థాపానికి గురైన సచిన్ పురుగుల మందు తాగాడు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న ఏఎంఓ చంద్రశేఖర్

గూడూరు: విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఏఎంఓ ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని భూపతిపేట ఎంపీ యూపీఎస్‌లో శనివారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల బలోపేతంతోపాటు విద్యార్థుల్లో ఉన్నత శ్రేణిని పెంచడానికి చదువుపై ఆసక్తి పెంచే విధంగా విద్యాబోధన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అదేవిధంగా ప్రతీ నెలలో పాఠశాలలో జరిగే సమావేశానికి తల్లిదండ్రులు హాజరై తమ సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, నీరజ, రమేష్, చైతన్య, శ్రీధర్, వెంకన్న, శ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.


ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న అధికారి సంధ్యారాణి

మహబూబాబాద్ అర్బన్: తల్లిదండ్రుల సమావేశంలో సందేహాలు లేకుండా తమ అభిప్రాయాలను తెలపాలని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఇన్‌చార్జ్ ప్రత్యేక అధికారి సంధ్యారాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి సంధ్యారాణి మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలన్నారు. పాఠశాల విద్యా బోధన, వసతి గృహం భోజనం, ఇతర సదుపాయాలను పిల్లలను అడిగి తెలుసుకోవాలన్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణ శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సునీత, మంజుల, భద్రమ్మ, అరుణ, స్రవంతి, మాధవి, తల్లిదండ్రులు శైలజ, రేణుక పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న ‘మున్నేరు’



కనువిందు చేస్తున్న మున్నేరువాగు ఆనకట్ట

డోర్నకల్: డోర్నకల్ పట్టణ సమీపంలోని మున్నేరువాగు ఆనకట్ట కనువిందు చేస్తుంది. మున్నేరు ఆనకట్ట నీటితో నిండి పైనుంచి ప్రవహిస్తుంది. ఆనకట్టకు కొద్ది దూరంలో సీతారామా ప్రాజెక్ట్‌కు సంబంధించిన యాక్విడెక్ట్ నిర్మించడంతో మున్నేరు బ్రిడ్జిపై నుంచి ఆనకట్ట అందాలు కనువిందు చేస్తున్నాయి. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు మున్నేరు బ్రిడ్జి పైనుంచి ఫొటోలు దిగుతూ సందడి చేస్తున్నారు. మున్నేరు ఆనకట్ట ప్రాంతాన్ని పిక్‌నిక్ స్పాట్‌గా తీర్చి దిద్దాలని ప్రజలు మున్సిపాలిటీ పాలకవర్గంతో పాటు అధికారులను కోరుతున్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలి



మాట్లాడుతున్న నాగవాణి

తొర్రూరు రూరల్: విద్యార్థులు చెడు మార్గాలకు వెళ్లొద్దని సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ నాగవాణి అన్నారు. శనివారం మండలంలోని చెర్లపాలెం ప్రభుత్వ పాఠశాలలో చైల్డ్‌హెల్ప్ లైన్ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నాగవాణి మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలు చూడడం మానుకోవాలని, ప్రస్తుత విద్యార్థి దశలో ఉన్న మీరు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలన్నారు. ఎవ్వరైనా వేధింపులకు గురి చేసేందుకు ప్రయత్నం చేస్తే వెంటనే 1098 నంబర్ ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బుచ్చయ్య, ఎస్సై అరుణ, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి వీరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబయట పిల్లల సర్వే

బయ్యారం: మండలంలోని ఉప్పలపాడు కాంప్లెక్స్ పరిధిలోని నర్సాతండా హ్యాబిటేషన్లలో శనివారం బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీ బాబురావు, హెచ్‌ఎం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన డబుల్ ఇళ్ల నిర్మాణాలు



నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు

తొర్రూరు రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రారంభించిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు ఏళ్లు గడుస్తున్న నత్తనడకనే కొనసాగుతున్నాయి. ప్రధానంగా మండలంలోని మాటేడు, గుర్తూరు, జమస్థాపురం, వెలికట్ట, తొర్రూరు పట్టణంలో నిర్మిస్తున్న డబుల్ ఇళ్ల నిర్మాణాల్లో కొన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మిగిలిన మధ్యలోనే నిలిచిపోయాయి. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లు ప్రభుత్వం ఇస్తున్న డబ్బులతో ఇళ్ల నిర్మాణాలను చేపట్టలేమని, ఇళ్ల నిర్మాణాలు చేపడితే పూర్తిగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇళ్ల నిర్మాణాన్నింటిని నిలిపివేశాడు. కొత్త ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిలిచిపోయినా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి పేదలకు అందించాలని కోరుతున్నారు.

సీఎంకు ధన్యవాదాలు

కేసముద్రం: మాజీ ఎంపీటీసీలకు నెలనెలకు పింఛన్‌లు ఇవ్వాలని నిర్ణయం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మాజీ ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నారపు యాకయ్య శనివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపాడు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠాపన

ఖానాపురం: మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలోని కోదండ రామాలయంలో పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వేడుకగా ప్రారంభమైంది. విగ్రహ కైంకర్య దాతలు వెంకట్‌రెడ్డి–శోభారాణి దంపతులు వేదపండితులు శ్రీధరాచార్యుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనము, అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠ, ఉత్సవ విగ్రహాభిషేకం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న పోలీసులు

గార్ల: మండలంలోని బుద్దారం తండాలో కాపుసారా స్థావరాలపై ఆబ్కారీ పోలీసులు దాడులు నిర్వహించి 800 లీటర్ల బెల్లంపానకం పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ ఆబ్కారీ సీఐ చిరంజీవి శనివారం తెలిపాడు. బుద్దారంతండా సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా కాపుసారా కాస్తున్నారనే పక్కా సమాచారంతో తెల్లవారుజామున స్థావరాలపై దాడులు నిర్వహించి కాపుసారాను స్వాధీనం చేసుకొని అక్కడే ధ్వంసం చేసినట్లు తెలిపాడు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నాడు. దాడుల్లో ఆబ్కారీ ఎస్సైలు కృష్ణమూర్తి, హరీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్‌లో బలమైన శక్తిగా కాంగ్రెస్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

చిన్నగూడూరు: ప్రభుత్వ విప్‌గా డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్‌ను ప్రభుత్వం నియమించడంతో మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం దాశరథి ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వల్లూరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా ఉండి రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లోను విజయం సాధించాలన్నారు. భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మారబోయిన వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పిల్లి వీరన్న, వడ్లకొండ ఆదాం టీజేఏసీ నాయకులు గాడిపెల్లి అనిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కురవి: మండల కేంద్రంలో కుమ్మరికుంట్ల సైదులు శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎర్ర నాగేశ్వర్‌రావు, టౌన్ అధ్యక్షుడు రాజేందర్‌కుమార్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించాడు. కార్యక్రమంలో నాయకులు బాలగాని శ్రీనివాస్, బాదె వీరభద్రం, అనబత్తుల వీరభద్రం, బాదావత్ లక్ష్మణ్, మోసం వినయ్, మిర్యాల లక్ష్మయ్య పాల్గొన్నారు.

మనసున్న మాస్టార్లు..

- సొంత ఖర్చులతో పాఠశాలకు కుళాయిల ఏర్పాటు



ఉపాధ్యాయుడు ఏర్పాటు చేసిన కుళాయి వద్ద ప్లేట్లు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పెద్దవంగర: పాఠశాల విద్యలో కొత్త ఒరవడిని సృష్టించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు–మన బడి పథకం నిధుల కొరతతో లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు రూ.4.18 మంజూరు కాగా 80శాతం పనులు పూర్తి అయ్యాయి. నిధులు సకాలంలో అందక గుత్తేదారులు మిగిలిన పనులు చేపట్టేందుకు వెనుకడుగు వేశారు. దీంతో పలుర కాల మరమ్మతులు చేసినప్పటికీ నీటి వసతులు కల్పించలేదు. దీంతో విద్యార్థులకు నీటికష్టాలు తప్పలేదు. ఈ పాఠశాలలో 65 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజనం తిన్న తర్వాత ప్లేట్లను శుభ్రం చేసుకునేందుకు పాఠశాల పరిసరాల ప్రాంతంలోని ఇంటి వద్దకు వెళ్లి శుభ్రం చేసుకుంటున్నారు. ఆ ఇంటివారు నీళ్ల ఇంట్లో లేకుండా చేస్తున్నారని పాఠశాల హెచ్‌ఎం కవిరాజుతో పాటు ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదే పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా మని చేస్తున్న అలేటి ప్రదీప్ రూ.6వేలు వెచ్చించి కుళాయిలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నీటి వసతిని కల్పించాడు. హెచ్‌ఎం కవిరాజు సైతం పాఠశాల నిధులతో మరుగుదొడ్లను ఏర్పాటు చేయించాడు. పాఠశాల మనుగడకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో శభాష్ అనిపించుకుంటూ విద్యార్థులకు చదువుపై మక్కువ పెంచుతున్నారు.

ఫత్తేపురంలో బోనాల వేడుకలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

తొర్రూరు రూరల్: మండలంలోని ఫత్తేపురం గ్రామంలో దుర్గమాత పండుగ ఉత్సవాల్లో భాగంగా అన్నివర్గాల ప్రజలు బోనాల పండుగ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా నైవేద్యంతో కూడిన బోనాలను డప్పుచప్పుళ్లు, ఆటపాటలు, కోలాటలతో నృత్యాలు చేస్తూ దేవాలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.